క్లుప్తంగా

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

కడప కార్పొరేషన్: విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల్లో భాగంగా ఈ నెల 10న కడప పట్టణంలో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్–2 సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.లక్ష్మానాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. ముత్రాసుపల్లి, రెడ్డి కాలనీ, పక్కీరుపల్లి, ఓం శాంతి నగర్, అబ్దుల్‌కలాం కాలనీ, చిన్న చౌక్, విద్యామందిర్ స్కూల్, భాగ్యనగర్ కాలనీ, దేవుని కడప, గౌస్ నగర్, నిర్మల స్కూల్, మాచుపల్లి రోడ్డు, మాసాపేట, నమస్తే బోర్డు, భారతి బార్, ద్వారకా నగర్, సంధ్యా సర్కిల్, ఎర్రముక్కపల్లి, సిపి బ్రౌన్, మున్సిపల్ ఆఫీసు, ఆర్టీసీ బస్టాండు, పటేల్ రోడ్డు, అరవింద్ నగర్, తేజ పెట్రోల్ బంకు, తదితర ప్రాంతాలలో ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్తు సరఫరా ఉండదని, ప్రజలు ఈ మార్పును గమనించి సహకరించాలని కోరారు.

పరిసరాల పరిశుభ్రతతోనే మెరుగైన ఆరోగ్యం


ఫ్రైడే డ్రైడేపై అవగాహన కల్పిస్తున్న నాగరాజు

కడప రూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే మెరుగైన ఆరోగ్యం సమకూరుతుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ నగర్‌లో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని శుక్రవారం డీఎంహెచ్ఓ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్థానికులకు ఫ్రైడే డ్రైడే ప్రాముఖ్యత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. వారానికోసారి ఇళ్లల్లోని తొట్లు, కుండలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మురికి నీటి గుంతలలో చెత్త వేయవద్దని, వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హైమావతి, అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ వెంకటరెడ్డి, సబ్ యూనిట ఆఫీసర్ నాగలక్ష్మిరెడ్డి, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

టెక్నీషియన్‌కు పదోన్నతి

కడప రూరల్: కర్నూలు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్–2గా పని చేస్తున్న ఉద్యోగి సోమ శేఖర్‌కు ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్–1గా పదోన్నతి కల్పించారు. కడప ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో అతడికి పోస్టింగ్ కల్పించారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ ఆర్డీ డాక్టర్ రామగిడ్డయ్య మాట్లాడుతూ నిబంధనల ప్రకారం పదోన్నతి కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వెంకటసుబ్బమ్మ, వనీష పాల్గొన్నారు.

డీఏ, ఐఆర్, పీఆర్‌సీ వెంటనే విడుదల చేయాలి


జంబారపు అహరోను

కడప కార్పొరేషన్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ పెన్షనర్లకు బకాయి పడిన మూడు విడతల కరవు భత్యం(డీఏ), 2023 పీఆర్‌సీని వెంటనే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు జంబారపు అహరోను డిమాండ్ చేశారు. తన కార్యాలయంలో విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడుతూ పీఆర్‌సీ ఆలస్యమైతే ఐఆర్(ఇంటీరియం రిలీఫ్) మంజూరు చేయాలన్నారు. ఇప్పటికే రిటైర్డ్ ఉద్యోగులు, ఫ్యామిలీ పెన్షనర్లు అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. నిత్యావసర ధరలు ఆకాశాన్నంటిన తరుణంలో ఖర్చులు పెరిగాయన్నారు చాలామంది ఆనారోగ్య సమస్యలతో ఆర్థికంగా బాధపడుతున్నారని, మూడు విడతల కరువు భత్యాన్ని విడుదల చేయాలని కోరారు. పీఆర్సీ కమిటీ నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సి.గంగన్న, కేపీ.సుహాసిని, పి.బాలచౌడన్న, సి.నరేంద్రరెడ్డి, డీవై.ప్రేమలత పాల్గొన్నారు.

ముమ్మరంగా తనిఖీలు

కమలాపురం: పట్టణంలోని రైల్వేస్టేషన్, బస్టాండు, క్రాస్ రోడ్డు, సంబటూరు బస్టాండు తదితర ప్రాంతాల్లో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. శుక్రవారం జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు సీఐ ఎస్‌కే రోషన్, ఎస్ఐ విద్యాసాగర్ తమ సిబ్బందితో కలసి రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాల్లో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. అనుమానితులు బ్యాగులు పరిశీలించి వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఇతర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. వెహికల్ చెకింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ, ఎస్ఐ మాట్లాడుతూ ఎవరైన కొత్త వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

భక్తి శ్రద్ధలతో బర్సీ మహోత్సవం

కమలాపురం : పట్టణంలో వెలసిన దర్గా–ఏ–గఫారియా, జహీరియాలో వెలసిన శ్రీ హజరత్ ఖాదర్ మొహిద్దీన్ షా ఖాద్రి బర్సీ మహోత్సవం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం రాత్రి దర్గా పీఠాధిపతి సజ్జాద్–ఏ–నషీన్ హజరత్ ఫైజుల్ గఫార్ షా ఖాద్రి ఆధ్వర్యంలో బర్సీ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్త జనసందోహం నడుమ పీఠాధిపతి నివాసం నుంచి పూల చాదర్, గంధం ఊరేగింపుగా తీసుకువచ్చి దర్గాలోని స్వామి వారి మజార్లపై సమర్పించారు. అనంతరం ప్రత్యేక ఫాతెహా నిర్వహించారు. పీఠాధిపతి భక్తులకు గంధం పంచి పెట్టారు. అన్నదానం ఏర్పాటు చేశారు.

ఆలయం చెంత.. తొలగని చెత్త


మురుగుతో నిండిన కేసీ కాలువ


ఆలయం సమీపంలో పేరుకపోయిన చెత్తాచెదారంలో సంచరిస్తున్న పందులు

కడప ఎడ్యుకేషన్: కడప నగరం పరిధిలోని విద్యుత్ నగర్ వినాయక దేవాలయం పరిసరాలు చెత్తతో నిండి కనిపిస్తున్నాయి. వర్షం కురిసి చిన్న గాలి వీచినా చెత్తా చెదారం నుంచి భరించలేని దుర్గంధం వస్తోందని స్థానికులు చెబుతున్నారు. కాలనీ వాసులు ఆలయం పరిసరాల్లో చెత్తాచెదారం వేయడంతో అపరిశుభ్రంగా మారి పందులకు ఆవాసంగా మారింది. కార్పొరేషన్ సిబ్బంది చెత్తను తొలగించినప్పటికీ స్థానికులు మళ్లీ అదే ప్రాంతంలో చెత్తను పడేస్తున్నారు. దీంతో పందులు నిత్యం సంచరిస్తూ అపరిశుభ్రం చేస్తున్నాయి. పక్కనే వినాయక దేవాలయం ఉండడంతో గుడికి వెళ్లే వారూ ఈ దుర్గంధం భరించాల్సి వస్తోంది.
కేసీ కాలువలో స్థానికులు చెత్తా చెదారం వేయడంతో అదికాస్త మురుగుతో నిండుతోంది. అధికారులు స్పందించి చెత్తాచెదారం తొలగించాలని, కాల్వలో పూడిక తీసి శుభ్రం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

విశ్వవిద్యాలయం ప్రగతే మన అజెండా

వైస్ చాన్స్‌లర్ అల్లం శ్రీనివాసరావు


మాట్లాడుతున్న వీసీ అల్లం శ్రీనివాసరావు

కడప ఎడ్యుకేషన్: కోర్సులు, పరిశోధనలు సమాజానికి తెలిసేలా ఉండాలని, వైవీయూ ప్రగతి మన అజెండా కావాలని యోగివేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు ఉద్బోధించారు. తన ఛాంబర్‌లో హెచ్‌ఓడీలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏపీ పీజీ సెట్‌కు దరఖాస్తు చేసుకున్న, చేసుకోబోతున్న విద్యార్థుల వివరాలు తెలుసుకొని ఇక్కడ లభించే నాణ్యమైన బోధన, సహ పాఠ్యేతర కార్యక్రమాల గురించి తెలియజేయాలన్నారు. పరీక్ష కేంద్రాలలో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటుచేయాలన్నారు. త్వరలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్ల పదోన్నతులు చేపడతామని వెల్లడించారు. అకడమిక్ కన్సల్టెంట్లకు ప్రయోజనకరమైన 110 జీవోను అమలుచేస్తామని, పరిపాలనా విధానంలో మార్పులుంటాయని తెలిపారు. నాణ్యమైన విద్య అందేందుకు క్లాస్ మానిటరింగ్ కమిటీ ఏర్పాటుచేస్తామని వివరించారు. ఈ సమావేశంలో ఆచార్య ఎస్.రఘునాథ్ రెడ్డి, ఆచార్య పుత్తాపద్మ, కృష్ణారెడ్డి, డీన్లు, విభాగాధిపతులు పాల్గొన్నారు.

వైవీయూ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు ప్రశంస


అవార్డులతో విద్యార్థులు, తదితరులు

కడప ఎడ్యుకేషన్: వైవీయూ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ప్రతిభ కనబరచి కర్ణాటకలోని కువెంపు యూనివర్సిటీ నుంచి ప్రశంసలు పొందారు. ఈ నెల 3వ తేదీ నుంచి 9వ తేదీ వరకూ నిర్వహించిన నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంపుకు పలు రాష్ట్రాల నుంచి 100 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో వైవీయూ క్యాంపస్ కళాశాల నుంచి ఐదుగురు, ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ నుంచి ఇద్దరు, ఎస్‌కేఆర్ఎస్‌కేఆర్ ఉమెన్స్ కాలేజ్ నుంచి ఇద్దరు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు కడప జిల్లా నుంచి హాజరయ్యారు. రాష్ట్ర సంస్కృతి, యోగి వేమన యూనివర్సిటీ వైభవం, వివిధ పాటలు, ఆటలు, నాటకం, నృత్యం, కల్చరల్ ప్రోగ్రామ్స్ ద్వారా వారు పరిచయం చేశారు. ఇందులో ప్రతిభ కనబరిచిన ఈశ్వర్, సిరిచందనలకు బెస్ట్ వాలంటీర్, డా. కె.శ్రీనివాసరావుకు బెస్ట్ ప్రోగ్రాం ఆఫీసర్‌గా గుర్తించి కువెంపు యూనివర్సిటీ సత్కరించింది. ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డా.వెంకటరామిరెడ్డి విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

కార్మికులతో అదనపు వసూళ్లు దారుణం

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లా వ్యాప్తంగా మున్సిపాలిటీలో పనిచేస్తున్న అడిషనల్ వర్కర్స్ వద్ద కాంట్రాక్టర్లు ప్రతినెలా రూ.500 వసూలు చేయడం దారుణమని ఏపీ మునిసిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు మనోహర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.విజయభాస్కర్, జిల్లా కోశాధికారి ఎస్.గోపి పేర్కొన్నారు. నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడుతూ జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, మైదుకూరు, ఎర్రగుంట్ల, బద్వేల్, పులివెందల, కడప ప్రాంతాల్లో అడిషనల్ వర్కర్స్‌ను కొవిడ్ కాలంలో తీసుకున్నారని, వారికి రూ.12వేలు మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. పీఎఫ్, ఈఎస్ఐ కట్టడం లేదని, అయినా కాంట్రాక్టర్లు కమీషన్ వసూలు చేయడం తగదన్నారు. కడపలో మరీ ఎక్కువగా వసూలు చేస్తున్నారన్నారు. ఇందుకు నిదర్శనం వర్కర్స్ బ్యాంక్ స్టేట్‌మెంట్ చూస్తే అర్థమవుతుందన్నారు. అధికారులు జోక్యం చేసుకొని వర్కర్లకు న్యాయం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమ కవుల జయంతి నిర్వహించాలి

కడప కల్చరల్: సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో రాయలసీమకు చెందిన కవులు, కళాకారులు, రచయితల జయంతులు నిర్వహించాలని యోగివేమన విశ్వవిద్యాలయం పాలక మండల సభ్యులు ఆచార్య మూలమల్లికార్జున రెడ్డి అన్నారు. వైవీయూ వీసీ ఆచార్య అల్లం శ్రీనివాసరావును శుక్రవారం ఆయన కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటి నన్నెచోడుని కాలం నుంచి నేటి నారాయణాచార్యుల కాలం వరకు రాయలసీమలో అద్భుత సాహిత్యం వెలువడిందని, చరిత్ర ప్రారంభమైనప్పటి నుంచి ఇంత వరకు రాయలసీమ కవులు, పండితులు, అవధానులు, విమర్శకులు ఉన్నారన్నారు. సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో వారి జయంతులు నిర్వహించాలన్నారు. యోగివేమన విశ్వవిద్యాలయం ఉప కులపతి అల్లం శ్రీనివాసరావు స్పందిస్తూ వీలైనంత త్వరలో సాహిత్య సంబంధమైన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

మట్టి నమూనా పరీక్షలు.. రైతులకు ఉపయుక్తం


పొలంలో మట్టిని సేకరిస్తున్న తిరుపతి వేంకటేశ్వర వ్యవసాయ కళాశాల విద్యార్థులు

కడప అగ్రికల్చర్: మట్టి నమూనా పరీక్షలు.. రైతులకు ఎంతో ఉపయుక్తం అని తిరుపతి వేంకటేశ్వర వ్యవసాయ కళాశాల విద్యార్థులు పేర్కొన్నారు. గ్రామీణ అవగాహన కృషి అనుభవ పథకం(ఆర్ఏడబ్ల్యూఈపీ) కింద శుక్రవారం మట్టి నమూనాల సేకరణపై రైతులకు అవగాహన కల్పించారు. ముందుగా విద్యార్థినులు పొలంలోని పది ప్రదేశాల్లో 15–20 సెంటీమీటర్ల లోతున మట్టిని సేకరించారు. అనంతరం మాట్లాడుతూ మట్టి నమూనా పరీక్షలతో మట్టిలోని పోషకాలు, పీహెచ్ స్థాయి, మట్టిలో తేమశాతం విషయాలను తెలుసుకోవచ్చన్నారు. అవసరమైన ఎరువులను వాడుకుని పంటల సాగులో అనవసర ఖర్చు తగ్గించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

మురళీ నాయక్‌కు నివాళి

కడప కార్పొరేషన్: ఆపరేషన్ సిందూర్‌లో దేశం కోసం పోరాడుతూ తన ప్రాణాలర్పించిన వీర జవాన్ మురళీ నాయక్‌కు ప్రజా ప్రతినిధులు, నాయకులు ఘనంగా నివాళులర్పిస్తున్నారు. పోరులో తన ప్రాణాలు త్యాగం చేశారని సంతాపం ప్రకటిస్తున్నారు.

తీవ్ర ఆవేదనకు గురిచేసింది



ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా జమ్మూ కశ్మీర్‌లో పోరాడుతూ రాష్ట్రానికి చెందిన మురళీ నాయక్ వీరమరణం పొందడం నాకు ఆవేదన కలిగించింది. సత్యసాయి జిల్లా గో కల్లి తండా గ్రామానికి చెందిన మురళీ నాయక్ ధైర్య సాహసాలు రాష్ట్రానికే గర్వకారణం. అతడి కుటుంబానికి అండగా ఉంటాం.

పి.రవీంద్రనాథ్‌రెడ్డి,
వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

మురళీ నాయక్ త్యాగాన్ని మరువలేం



జమ్ము కశ్మీర్‌లో తెలుగు జవాన్‌ మురళీ నాయక్ వీరమరణం పొందడం బాధాకరం. దేశభద్రతలో తన ప్రాణాలను పణంగా పెట్టి వీరమరణం పొందిన మురళీ నాయక్ త్యాగాన్ని మరువలేము. శోకతప్తులైన వారి కుటుంబీకులకు సంతాపం తెలుపుతున్నా.

ఎస్‌బీ.అంజద్‌బాషా,
మాజీ ఉప ముఖ్యమంత్రి

మురళీ నాయక్ వీరమరణం



సత్యసాయి జిల్లాకు చెందిన మురళీనాయక్ యుద్ధభూమిలో ప్రాణాలు కోల్పోవడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని అన్నారు. దేశం కోసం అతడు వీర మరణం పొందారని, ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలన్నారు. దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన మురళీ కుటుంబానికి అందరూ అండగా నిలవాలన్నారు.

పి.జయచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ
జిల్లా అధికార ప్రతినిధి

జ్వరాలు ప్రబలకుండా చూడాలి

కడప కోటిరెడ్డిసర్కిల్: అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ఫ్రైడేని డ్రైడేగా పాటిస్తూ తమ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని హెల్త్ ఎడ్యుకేటర్ ప్రసన్నలత తెలిపారు. కడప నగర పరిధిలోని నాగరాజుపేట అర్బన్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్ బృందం శుక్రవారం ఫీవర్ సర్వే, దోమల సర్వే నిర్వహించింది. ఈ సందర్భంగా ప్రసన్నలత మాట్లాడుతూ ప్రజలకు డెంగీ, చికున్ గన్యా, మలేరియా, బోదకాలు, ఇతర జ్వరాలు రాకుండా ఫ్రైడే డ్రైడే పాటించాలన్నారు. దోమలు కుట్టకుండా దోమలు తెరలు వాడుకోవాలని, చుట్టుపక్కల మురుగు నిల్వ లేకుండా చూడాలని తెలిపారు. టెంకాయ చిప్పలు, ప్లాస్టిక్ కప్పులు లేకుండా చూసుకోవాలన్నారు. ముస్కాన్, ప్రియా, నీరజారెడ్డి, సోనుసాలెహ పాల్గొన్నారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

కమలాపురం : మండలంలోని రామాపురంలో వెలసిన నిత్య కల్యాణ మూర్తుల బ్రహ్మోత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. పుణ్యభూమి ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యుల ఆధ్వర్యంలో శనివారం నుంచి ఐదు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు.

పట్టాలపై నడక.. ప్రమాదం ఎరుగక..







కడప రైల్వే స్టేషన్‌లో ప్రమాదం గుర్తించకుండా ప్రయాణీకులు ఫ్లాట్‌ఫామ్ దాటేస్తున్నారు. ఏ రైలు దూసుకువస్తుందో గుర్తించకుండానే కడప రైల్వే స్టేషన్‌లో ప్రమాదం వెంట ఇలా పరుగు పెడుతున్నారు. రైల్వే ఓవర్ బ్రిడ్జి ఉన్నప్పటికీ అటు వెళ్లకుండా తమ లగేజీ బ్యాగులు తీసుకుని ఇలా రైల్వే లైన్ దాటేస్తున్నారు. వారిలో మహిళలు, చదువుకున్న విద్యార్థులు కూడా ఉన్నారు. అనుకోని రీతిలో ఏదైనా రైలు పట్టాలపైకి వస్తే ప్రమాదం జరగక తప్పదు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కడప

హైకోర్టు తీర్పు రాజ్యాంగ విరుద్ధం

సోషల్ వెల్ఫేర్ బోర్డు మాజీ ఛైర్మెన్ పులి సునీల్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న దళిత నాయకులు

కడప కార్పొరేషన్: ఇటీవల ఒక పాస్టర్ కేసులో హైకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగానికి విరుద్ధంగా ఉందని సోషల్ వెల్ఫేర్ బోర్డు మాజీ ఛైర్మెన్ పులి సునీల్‌కుమార్, వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాన్ అన్నారు. మాజీ డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో శుక్రవారం వారు మాట్లాడారు. క్రైస్తవ మతం స్వీకరించే దళితులు ఎస్సీ హోదా కోల్పోతారని హైకోర్టు చెప్పడం సరికాదన్నారు. ఒక వ్యక్తికి సంబంధించిన కేసును ఆ వ్యక్తి వరకే చూడాలి తప్ప.. రాష్ట్రంలో ఎస్సీలందరికీ వర్తించేలా తీర్పునివ్వడం సరికాదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళిత హక్కులను కాలరాసి, రాజ్యాంగ ఫలాలు వారికి అందకుండా చేసే ప్రయత్నాలు చేస్తున్నాయని మండిపడ్డారు. తద్వారా రిజర్వేషన్లను రద్దు చేసి వారిని అణచివేసే దిశగా కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. కులం వేరు, మతం వేరు అనే విషయాలను ప్రభుత్వాలు గుర్తించాలని అన్నారు. భారత రాజ్యాంగం ప్రకారం దేశంలో నివసించే ప్రతి పౌరుడికి మత స్వేచ్ఛ ఉందని, ఎవరికి నచ్చిన మతాన్ని వారు స్వీకరించవచ్చన్నారు. మతం మారినంత మాత్రాన వారిపై ఉన్న కుల వివక్ష, అంటరానితం సమసిపోవన్నారు. వారి కులం ఎప్పటికీ మారదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దళితులు, దళిత క్రైస్తవులపై సవతితల్లి ప్రేమ చూపిస్తోందన్నారు. పాస్టర్లకు ఇవ్వాల్సిన గౌరవ వేతనం ఇంత వరకూ ఇవ్వలేదని, రాష్ట్రంలో 8 లక్షల మంది పాస్టర్లు ఉంటే 7 వేల మందికే గౌరవ వేతనం ఇచ్చారన్నారు. అందరికీ గౌరవ వేతనం ఇచ్చేంత వరకూ వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుందన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి త్యాగరాజు, నగర అధ్యక్షుడు కంచుపాటి బాబు పాల్గొన్నారు.

పుట్లంపల్లి చెరువు తూములు కొనసాగించాలి


చెరువును పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: కడప పరిధిలోని పుట్లంపల్లి చెరువు కింద తూములు యథాతథంగా కొనసాగించాలని సీపీఎం కడప నగర కార్యదర్శి రామమోహన్ డిమాండ్ చేశారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా నగరంలోని పుట్లంపల్లి చెరువు అభివృద్ధి పనులను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెరువు అభివృద్ధి పేరుతో తూముల ద్వారా పంట పొలాలకు నీరందే అవకాశం లేకుండా చేయడం తగదన్నారు. తూములను పూడ్చడం ద్వారా వంద ఎకరాలకు చెరువు నీరు విడుదల అయ్యే అవకాశం లేదన్నారు. వ్యవసాయ భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం మార్చినా, చెరువు నిండినప్పుడు బయటికి నీరు విడుదల కావాల్సి ఉందన్నారు. తక్షణమే అధికార యంత్రాంగం చర్యలు తీసుకుని తూములు కొనసాగించేలా నిర్మాణం చేపట్టేలా చూడాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేయాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరిరెడ్డి, నగర కమిటీ సభ్యులు చంద్రారెడ్డి, రామకష్టారెడ్డి, గోవిందు, నరసింహ, జార్జి,భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని వినతి


ఆర్డీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కడప రూరల్: వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్–4 పరిధిలోని ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ కడప, అనంతపురం జిల్లాల అధ్యక్షులు శ్రీనివాసులు, చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. కడప కార్యాలయంలో రీజినల్ డైరెక్టర్ డాక్టర్ రామగిడ్డయ్యను శుక్రవారం వారు కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలో 30 ఏళ్లుగా పనిచేస్తున్న ఏఎన్ఎంలకు ఇంతవరకూ పదోన్నతి కల్పించలేదన్నారు. ప్రాంతీయ కార్యాలయం పరిధిలోని పీహెచ్ఎన్, ఎంపీహెచ్ఈఓ, ఫార్మసీ సూపర్‌వైజర్ తదితర క్యాడర్లలో వారికి పదోన్నతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.ప్రసాద్‌యాదవ్, జిల్లా కార్యదర్శి డి.రవికుమార్, చంద్రమోహన్, జిల్లా మహిళా కన్వీనర్ జమీల పాల్గొన్నారు.

సీఎస్ఐ ఎన్నికల్లో అర్హులకు ఓటు హక్కు కల్పించాలి


విలేకరులతో మాట్లాడుతున్న ఎన్‌డీ చంద్రశేఖర్

కడప రూరల్: చర్చి ఆఫ్ సౌత్ ఇండియా రాయలసీమ డయాసిస్‌కు నిర్వహించే ఎన్నికల్లో అర్హులకు ఓటు హక్కు కల్పించాలని ఆ చర్చి రాయలసీమ అధ్యక్ష మండల మాజీ సెక్రటరీ ఎన్‌డీ.చంద్రశేఖర్ తెలిపారు. స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడుతూ చర్చి ఆఫ్ సౌత్ ఇండియా రాయలసీమ డయాసిస్ సీఎస్ఐ పేరుతో ప్రఖ్యాతి గాంచిందన్నారు. ఈ డయాసిస్ కింద రాయలసీమ అంతటా చర్చిలున్నాయని పేర్కొన్నారు. కడప నగరానికి సంబంధించి సీఎస్ఐ సెంట్రల్, క్రైస్ట్ చర్చి ఉండగా, వాటి పరిధిలో 2060కు పైగా కుటుంబాలు ఉన్నాయన్నారు. డయాసిస్‌కు సర్వసాధారణంగా మూడేళ్లకు ఒకసారి ఎన్నికలు జరిపి పది మంది సభ్యులను ఎన్నుకుంటారన్నారు. ఈ ఎన్నికల్లో భాగంగా అర్హులకు ఓటుహక్కు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో చర్చి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి


ధర్నా నిర్వహిస్తున్న ఏఐఎస్‌బీ నాయకులు

కడప ఎడ్యుకేషన్: జిల్లా వ్యాప్తంగా నిబంధనలు పాటించని కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత విద్యార్థి బ్లాక్ జిల్లా కన్వీనర్ సగిలి రాజేంద్ర ప్రసాద్ డిమాండ్ చేశారు. ఏఐఎస్‌బీ ఆధ్వర్యంలో కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ డీఈఓ కార్యాలయ ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థలు అనుమతులు లేకుండా, రెన్యువల్ గడువు ముగిసినా పాఠశాలలను నిర్వహిస్తున్నాయన్నారు. షిఫ్టింగ్ అనుమతి లేకున్నా అక్రమ అడ్మిషన్లు నిర్వహిస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నాయన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్, షూ, టై వంటివి అమ్ముతూ సంపాదన ధ్యేయంగా పనిచేస్తున్నాయని తెలిపారు. విద్యా సంస్థలపై చర్యలు తీసుకోని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు. అనంతరం డీఈఓ షంషుద్దీన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అఖిల్, సుమంత్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై ఉపాధ్యాయుల పోరు



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఏపీటీఎఫ్ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్ : పాఠశాల విద్యారంగంలో ప్రభుత్వం అవలంబిస్తున్న అసంబద్ధ విధానాలపై ఉపాధ్యాయులు పోరుబాట పట్టారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు శుక్రవారం కడప కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమ్మిరెడ్డి శ్యామసుందర్‌రెడ్డి మాట్లాడుతూ సంస్కరణల పేరుతో ప్రభుత్వం గందరగోళ పరిస్థితులు కల్పిస్తోందని, వాటిని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం ఆరు రకాల పాఠశాలలు నెలకొల్పితే, ఈ ప్రభుత్వం తొమ్మిది రకాల పాఠశాలలను ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తోందన్నారు. ఒక్కో పాఠశాలకు ఒక్కో రకమైన విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తిని ప్రకటించడాన్ని వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో 1 నుంచి 5 తరగతుల వరకు మోడల్ ప్రాథమిక పాఠశాల లేదా బేసిక్ ప్రాథమిక పాఠశాలగా కొనసాగించాలని పేర్కొన్నారు. ప్రాథమిక పాఠశాలలకు పూర్వ ప్రాథమిక విద్యను అనుసంధానం చేయాలని కోరారు. ఆంగ్లమాధ్యమానికి సమాంతరంగా తెలుగు మాధ్యమం కొనసాగించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్, జీపీఎస్‌ను రద్దు చేసి ఏపీఎస్‌ను కొనసాగించాలని కోరారు. తమ డిమాండ్లు నెరవేర్చకపోతే ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో 14వ తేదీన విజయవాడలో రాష్ట్ర స్థాయి ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఖాదర్‌బాషా, శ్రీనివాసరెడ్డి, జిల్లా కార్యదర్శులు రమేష్‌రెడ్డి, మునివర్ధన్ కుమార్, రాంభూపాల్‌రెడ్డి, అబ్దుల్ సత్తార్, సుబ్బయ్య, రాష్ట్ర కౌన్సిలర్ సురేంద్రనాథరెడ్డి, సీకే శ్రీనివాసరెడ్డి, ఆడిట్ కమిటీ సభ్యులు నరసింహకుమార్, జి.పి. వెంకటేశ్వర్లు, సుబ్బారెడ్డి, జిల్లా కౌన్సిలర్లు క్రిష్టారెడ్డి, సయ్యద్‌బాషా, అన్వర్, నరసింహారెడ్డి, కొండారెడ్డి, బాబుల్ రెడ్డి, మణికుమార్, మస్తాన్‌బాబు, సుభాన్, రమణారెడ్డి, దామోదర్ , సంజీవరాయుడు, వరప్రసాదరెడ్డి, క్రిష్ణయ్య, రామసుధాకర్ రెడ్డి, షర్ఫుద్దీన్, మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.